క్లుప్తంగా

హాస్టల్‌లో మౌలిక వసతులు కల్పించాలి

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్‌ను బీఆర్‌ఎస్‌వీ జిల్లా నాయకుడు శేఖర్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా హాస్టల్‌లో ఉన్న సమస్యలను విద్యార్థులను అడిగి ఆయన తెలుసుకున్నారు. ఇప్పటి వరకు విద్యార్థులకు నోటుబుక్స్, బెడ్‌షీట్లు ఇవ్వక పోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో సాయి, దేవేందర్, నితిన్ పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటు

కల్వకుర్తిరూరల్: మండలంలోని కుర్మిద్దలో బుధవారం సీసీ కెమెరాలను ఎస్‌ఐ మాధవరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసాంఘిక కార్యక్రమాలకు, నేరాల అదుపునకు సీసీ కెమెరాలు ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించిన మాజీ సర్పంచ్‌లు శేఖర్‌ముదిరాజు, దామోదర్‌గౌడ్‌లను ఎస్‌ఐ అభినందించారు. సత్యం, జంగయ్య, కృష్ణయ్య, భాస్కర్, పరమేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

కూలిన మట్టిమిద్దె: తప్పిన ప్రాణాపాయం



లింగాల: మండలంలోని అంబట్‌పల్లిలో ఓ మట్టిమిద్దె కూలిన ఘటన మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు మట్టిమిద్దె కూలుతుందని భావించి గ్రామానికి చెందిన దస్తగిరి ఇంటి పక్కనే ఉన్న మరో ఇంటిలో నిద్రించారు. అదేరోజు రాత్రి మట్టిమిద్దె ఒక్కసారిగా కుప్పకూలింది. ముందు జాగ్రత్త కారణంగా ప్రాణాపాయం తప్పడంతో బాధిత కుటుంబసభ్యులు ఊపిరిపీల్చుకున్నారు.

ఆటో బోల్తా: వ్యక్తికి స్వల్ప గాయాలు

నాగర్‌కర్నూల్ క్రైం: ఆటో బోల్తా పడి వ్యక్తికి స్వల్ప గాయాలైన ఘటన మండలంలోని శ్రీపురం గ్రామ సమీపంలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం శ్రీపురం గ్రామానికి చెందిన డ్రైవర్ నరేష్ ఆటోలో ప్రయాణికులు శ్రీపురం నుంచి నాగర్‌కర్నూల్‌కు వెళ్తున్నారు. శ్రీపురం శివారు దాటగానే ప్రమాదవశాత్తు ఆటో బోల్తాపడింది. అదే గ్రామానికి చెందిన ప్రయాణికుడు నరేష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. బాధితుడిని చికిత్స నిమిత్తం జనరల్ ఆస్పత్రికి తరలించారు.

పాఠశాలల అభివృద్ధికి రూ.16 లక్షలు మంజూరు

లింగాల: మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు రూ.16 లక్షలు మంజూరు అయినట్లు ఎంపీడీఓ ఆంజనేయులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో కనీస సౌకర్యాలైన తాగునీరు, మరుగుదొడ్ల వసతులను కల్పించుటకు ఒక్కో పాఠశాలకు రూ.లక్ష చొప్పున మొత్తం 16 పాఠశాలలకు రూ.16 లక్షలు మంజూరు అయినట్లు పేర్కొన్నారు. ఆయా పాఠశాలల కమిటీల బ్యాంక్ ఖాతాలలో నిధులు జమ అయినట్లు ఆయన తెలిపారు.

తహసీల్దార్‌కు సన్మానం

ఉప్పునుంతల: మండలానికి నూతనంగా బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్ సునీతను బుధవారం స్థానిక కార్యాలయంలో బీఆర్‌ఎస్ మండల నాయకులు శాలువాతో సన్మానించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రవీందర్‌రావు, నాయకులు గోపాల్‌రెడ్డి, సర్వేష్ పాల్గొన్నారు.

బడ్జెట్ ప్రతులు కాల్చివేత

నాగర్‌కర్నూల్‌రూరల్: కేంద్ర ప్రభుత్వం ఇటీవల పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి సరైన నిధులు కేటాయించలేదని ఆరోపిస్తూ బుధవారం వామపక్ష పార్టీల వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో బడ్జెస్ ప్రతులను కాల్చి వేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర రైతు సంఘం కార్యవర్గ సభ్యుడు వార్ల వెంకటయ్య మాట్లాడుతూ స్వామినాథన్ సిఫార్సులను అమలు చేయడంలో కేంద్ర ప్రభుత్వం విఫలం అయ్యిందన్నారు. నాయకులు కృష్ణాజి, ఎం శ్రీనివాసులు, బాల్‌రాజు, గోపి, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో నిందితుడికి జైలు

వెల్దండ: డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడిన వ్యక్తికి రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్‌ఐ కురుమూర్తి తెలిపారు. ఈ నెల 26వ తేదీన మండల కేంద్రంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా రంగారెడ్డి జిల్లా ఆమనగల్లుకు చెందిన రాజు డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడ్డాడు. కల్వకుర్తి జేఎఫ్‌సీఎం కోర్టులో హాజరుపరచగా జడ్జి నిందితుడికి రెండు రోజుల జైలుశిక్ష విధించినట్లు పేర్కొన్నారు.

ఇద్దరికి కంటి ఆపరేషన్లు

దోమలపెంట: గ్రామానికి చెందిన ఇద్దరు సుబ్బమ్మ, దావీదులకు కటకం రాములమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆమె కుమారుడు కె.వెంకట్ బుధవారం హైదరాబాద్‌లో ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు కృతజ్ఞతలు తెలిపారు.

సంతకు స్థలం కరువు



పెద్దకొత్తపల్లి, పెద్దకార్పాముల రోడ్డుపై కూరగాయల విక్రయాలు

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రం నుంచి లింగాలకు వెళ్లే బీటీ రోడ్డుపై వారాంతపు సంత నిర్వహిస్తున్నారు. ప్రతి మంగళవారం రోడ్డుపైనే కూరగాయాలు రైతులు విక్రయిస్తున్నారు. రోడ్డును ఆక్రమించి తోపుడుబండ్లు ఏర్పాటు చేయడంతో వాహనదారుల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నారు. గతంలో గ్రామంలోని గ్రామ పంచాయతీ వీధుల వద్దనే సంత నిర్వహించేవారు. వాహనదారులకు ఎటువంటి ఇబ్బందులు ఉండేవి కావు. 2019 కరోనా సమయం నుంచి బస్టాండ్ నుంచి ఎల్లమ్మ గుడి వరకు సంతను నిర్వహించడంతో పెద్దకొత్తపల్లి నుంచి పెద్దకార్పాముల, చిన్నకార్పాముల, దేవినేనిపల్లి, జగన్నాథపురం, చిన్నకొత్తపల్లి, పాతయాపట్ల, కొత్తయాపట్ల, అంబడిపల్లి, లింగాలకు వెళ్లే ఆర్టీసీ బస్సులతోపాటు మోటారు సైకిళ్లు, ఆటోలు, జీపులు వెళ్లేందుకు అవస్థలు పడుతున్నారు. అదేవిధగా ప్రతి ఆదివారం కూడ దేవినేనిపల్లి మైసమ్మ జాతరకు వెళ్లే భక్తులకు కొబ్బరికాయలు, పూలు, కోళ్ళు ఇతర సామాగ్రిలు అమ్మేందుకు ఈ రోడ్డుపైనే ఇరువైపులా బండ్లు ఏర్పాటు చేయడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది.



ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

సంతను మరోచోటుకు మార్చాలి



కూరగాయల సంతను మరో చోటుకు మార్చాలి. పాత పోలీసు స్టేషన్ నుంచి గ్రామ పంచాయతీ వీధులలో సంతను ఏర్పాటు చేస్తే వాహనదారుల ఇబ్బందులు తొలగిపోతాయి. అధికారులు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి.

–బి శ్రీనివాసులు, ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి

సమస్య పరిష్కారానికి కృషి



కూరగాయల సంతను మార్చేందుకు కృషి చేస్తాం. అందరి సౌలభ్యం కోసం నిర్ణయం తీసుకుంటాం. గ్రామస్తులతో సమావేశం నిర్వహించి వారి నిర్ణయం మేరకు చర్యలు చేపడుతాం. ప్రజలు సహకరించాలి.

– నాగేందర్, ఎంపీడీఓ, పెద్దకొత్తపల్లి

అటెన్షన్ ప్లీజ్

అసంపూర్తిగా బీటీ పనులు



కంకర తేలిన పస్పుల రోడ్డు

పెద్దకొత్తపల్లి నుంచి పస్పుల, అదేవిధంగా కోడేరు నుంచి నాగులపల్లి వరకు అసంపూర్తిగా నిర్మించారు. మూడు నెలల కిందట మెటల్ రోడ్డు నిర్మాణం చేపట్టి బీటీ వేయకుండా వదిలివేశారు. కంకర పరచడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్ల నిర్మాణం కోసం అధికారులు రూ.13.50 కోట్ల నిధులు మంజూరు చేశారు. పనులు ప్రారంభించి కంకర వేసి బీటీ వేయకుండ అలాగే వదిలివేశారు. కోడేరు నుంచి వనపర్తి, పస్పుల మీదగా నాగర్‌కర్నూల్, హైదరాబాద్, మహబూబ్‌నగర్ తదితర ప్రాంతాలకు వెళ్లేందుకు ప్రయాణికులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. కాంట్రాక్టర్ అధికారులు స్పందించి నిలిచిన బీటీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించాలని ప్రయణికులు కోరుతున్నారు. – కోడేరు

సంప్రదించాల్సిన నంబర్: 72879 40130, రమాదేవి, ఆర్‌అండ్‌బీ డీఈ

‘పాలమూరు’కు జైపాల్‌రెడ్డి పేరు పెట్టాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

కల్వకుర్తిరూరల్: పాలమూరు, రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని దివంగత కేంద్ర మాజీ మంత్రి జైపాల్‌రెడ్డి పేరు పెట్టాలని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకురుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్ నిర్మాణం కోసం రూ. 10 వేల కోట్లు కేటాయించాలన్నారు. మాజీ సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో నార్లాపూర్, కర్వేనా, ఉద్దండాపూర్, వట్టెం రిజర్వాయర్‌లను పూర్తి చేసి మోటార్‌లు బిగించామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్మిదేవిపల్లి రిజర్వాయర్ నిర్మించి పాలమూరు, రంగారెడ్డి ద్వారా 12 లక్షల 50 వేల ఎకరాలకు సాగునీరు అందించాలన్నారు. గతంలో కల్వకుర్తి అభివృద్ధికి రూ.5 వేల కోట్ల నిధులు కేటాయించానన్నారు. 40 తండాలో పంచాయతీల రోడ్లు నిర్మాణానికి రూ.150 కోట్లు మంజూరు చేశామన్నారు. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి కల్వకుర్తి సభలో నియోజకవర్గానికి వరాలు ఇస్తారని భావించామని కాని ప్రజల ఆశలు నిరాశలు చేశారని విమర్శించారు. పీఏటీఎస్ చైర్మన్ తలసాని జనార్దన్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ కొందూరు గోవర్ధన్, మండల అధ్యక్షుడు విజయ్‌గౌడ్, సూర్యప్రకాష్‌రావు, మనోహర్‌రెడ్డి, గణేష్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ల్యాబ్ ఏర్పాటుకు రూ. లక్ష విరాళం



కల్వకుర్తిరూరల్: మండలంలోని తాండ్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాడ్రన్ సైన్స్ ల్యాబ్ ఏర్పాటుకు బుధవారం కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కాయితీ ఆశాదీప్‌రెడ్డి రూ.లక్ష విరాళం అందించారు. అతని తండ్రి దివంగత కాయితీ ప్రభాకర్‌రెడ్డి జ్ఞాపకార్థం ల్యాబ్ ఏర్పాటుకు చేయూతనిచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జహంగీర్ దాతను అభినందించి సన్మానించారు. ఉపాధ్యాయుడు జంగయ్య, మధుసూదన్, రాజ్యలత తదితరులు ఉన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం



యాదిరెడ్డిపల్లిలో మొక్కలు నాటుతున్న అధికారులు

తెలకపల్లి: పర్యావరణాన్ని పరిరక్షించుకుందామని ఎంపీడీఓ కృష్ణయ్య అన్నారు. బుధవారం మండలంలోని గౌరెడ్డిపల్లి ఉన్నత పాఠశాలలో వన మహోత్సవం సందర్భంగా ఆయన మొక్కలు నాటారు. అనంతరం ఎంపీడీఓ మాట్లాడుతూ మానవ జీవితం చెట్లతో ముడిపడి ఉందని వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అదేవిధంగా ఆ పాఠశాలలో స్వీపర్‌గా పనిచేస్తున్న నిరంజన్‌ను పదవీ విరమణ సందర్భంగా పూలమాలలతో, శాలువాతో సన్మానించారు. హెచ్‌ఎం సుధాకర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి అనిత, మాజీ సర్పంచ్ బాలగౌడ్, రామస్వామిగౌడ్, ఉపాధ్యాయులు, ఏపీఓ టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్, విద్యార్థులు పాల్గొన్నారు.

తాడూరు: మండలంలోని యాదిరెడ్డిపల్లిలో బుధవారం వనమహోత్సవం నిర్వహించారు. మొక్కల సంరక్షణ నాటే విధానంపై గ్రామంలో బ్యానర్ల ద్వార ర్యాలీ చేపట్టారు. అనంతరం ఎర్రగుట్టపై మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఎంపీఓ బ్రహ్మచారి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. ఏపీఓ చంద్రసిద్ధార్థ, ఎంపీడీఓ జ్యోతిపరోసియా, టెక్నికల్ అసిస్టెంట్ అనీల్, కురుమయ్య, మశన్న తదితరులు పాల్గొన్నారు.

పోకిరీలపై చర్యలు తీసుకోవాలి



అచ్చంపేట రూరల్: పట్టణంలో బాలికలు, మహిళలపై వేధింపులకు పాల్పడుతున్న పోకిరీలపై చర్యలు తీసుకోవాలని అంజనీమాత సేవా సమితి అధ్యక్షురాలు సునీతాబాయి, ప్రధాన కార్యదర్శి శకుంతల కోరారు. అచ్చంపేట ఎస్‌ఐ–2గా బాధ్యతలు చేపట్టిన మహిళా ఎస్‌ఐ ఇందిరను బుధవారం సేవా సమితి ఆధ్వర్యంలో సన్మానించారు. అనంతరం పలు విషయాలను ఎస్‌ఐ దృష్టికి తీసుకెళ్లారు. బాలికల కళాశాల, పాఠశాలల వద్ద పోకిరీ బెడద ఉందని వివరించారు. కార్యక్రమంలో హేమలత, అశ్విని, నాగేంద్రాబాయి, జగదీష్‌గౌడ్ పాల్గొన్నారు.

బాధ్యతగా పనిచేస్తే గుర్తింపు



బదిలీపై వెళ్లిన వారిని సన్మానించిన మండల పరిషత్ సిబ్బంది

తాడూరు: ప్రభుత్వ ఉద్యోగులు బాధ్యతగా పని చేస్తే గుర్తింపు వస్తుందని మాజీ ఎంపీపీ శ్రీదేవి అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో బదిలీపై వెళ్లిన పంచాయతీ కార్యదర్శులు, ఎంపీఓ అటెండర్‌లకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదల అభివృద్ధి కోసం అమలు చేసే సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు అందించాలన్నారు. కార్యక్రమంలో అధికారులు, ఆయా గ్రామాల పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వెల్దండ: మండలంలోని 12 గ్రామాల పంచాయతీ కార్యదర్శులు వివిధ మండలాలకు బదిలీపై వెళ్లారు. బుధవారం బదిలీ అయిన కార్యదర్శులకు ఎంపీడీఓ సత్యపాల్ రెడ్డి బదిలీ ఉత్తర్వు కాపీలను వారికి అందజేశారు. మండలంలోని లింగారెడ్డిపల్లి, నగరిగడ్డ తండా, నారాయణపూర్ తండా, చెదురుపల్లి, శంకరకొండ తండా, సిలోనిబావి తండా, చౌదర్‌పల్లి, మర్రిగూడ తండా, పోషమ్మగడ్డ తండా కార్యదర్శులు బదిలీ అయ్యారు. కార్యక్రమంలో ఎంపీఓ లక్ష్మణ్, సీనియర్ అసిస్టెంట్ రేవంత్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

ఏఐటీయూసీ నాయకుల ముందస్తు అరెస్ట్

తాడూరు: ఆటో క్యాబ్ మోటారు రంగ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం బుధవారం ఇందిరపార్క్ దగ్గర నిర్వహించే ధర్నాకు తరలి వెళ్లకుండా ఏఐటీయూసీ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఆసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శివశంకర్ మాట్లాడుతూ ధర్నాకు తరలివెళ్లకుండా అక్రమంగా అరెస్ట్ చేయడం అప్రజాస్వామ్యం అన్నారు. కార్యక్రమంలో కురుమయ్య, సత్యం తదితరులు పాల్గొన్నారు.

తెలకపల్లి: అసెంబ్లీ సమావేశాలు నడుస్తున్న సందర్భంగా ముందస్తుగా మండలంలో పనిచేస్తున్న హమాలీ కార్మికులను బుధవారం ముందుస్తు అరెస్ట్ చేసి పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా పోలీసుస్టేషన్‌లో హమాలీ సంఘం శ్రీరాజు, హమాలీ సంఘం అధ్యక్షుడు బారిగారి పరేమేష్ మాట్లాడుతూ హమాలీలను అక్రమంగా అరెస్ట్ చేయడం దారుణమన్నారు. హమాలీ కూలీలు పరమేశ్వర్, పరుశరాములు పాల్గొన్నారు.

భూ సమస్యలను పరిష్కరించాలి



వంగూరు: భూ సమస్యలలను అధికారులు సమయస్ఫూర్తితో పరిష్కరించాలని మాజీ ఎమ్మెల్యే గువ్వల బాల్‌రాజ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకురుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల ఉల్పరలో రెండు కుటుంబాల మధ్య జరుగిన భూ వివాదంలో ఎస్‌ఐ మహేందర్ ఏకపక్షంగా వ్యవహరిస్తూ ఒక వర్గంపై కేసులు నమోదు చేశాడని ఆరోపించారు. భూ సమస్యల విషయంలో సామరస్యంగా పరిష్కరించాలని కోరారు. బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు గణేష్‌రావు, మందరాజేందర్‌రెడ్డి, నరేందర్‌రావు, అంజనేయులు, రవియాదవ్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

వంగూరు: మండల కేంద్రానికి చెందిన రైతు మీసాల లక్ష్మయ్య ట్రాక్టర్ ప్రమాదంలో మంగళవారం మృతి చెందాడు. బుధవారం బాధిత కుటుంబసభ్యులను నాగర్‌కర్నూల్ మాజీ పార్లమెంటు సభ్యులు రాములు, అచ్చంపేట, కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యేలు గువ్వల బాల్‌రాజ్, జి.జైపాల్‌యాదవ్‌లు పరామర్శించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

ఉద్దంసింగ్‌కు ఘన నివాళి



నాగర్‌కర్నూల్‌రూరల్: బిజినేపల్లి మండలంలోని గంగారం ఉన్నత పాఠశాలలో బుధవారం సర్దార్ ఉద్దంసింగ్ 84వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రత్నశేఖర్, రాజన్న, ఆహ్మద్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

కొల్లాపూర్: పట్టణంలోని ఎస్టీ కాలేజ్ హాస్టల్‌లో బుధవారం స్వాతంత్ర్య సమరయోధుడు ఉద్దంసింగ్ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్దంసింగ్ చిత్రపటానికి బీఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి బి.దాసుతో పాటు, హాస్టల్ విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దాసు మాట్లాడుతూ జలియన్ వాలాబాగ్ మారణహోమానికి కారకుడైన జనరల్ డయ్యర్‌ను లండన్‌లో కాల్చిచంపి అమరుల ఆత్మకు శాంతి చేకూర్చిన గొప్ప దేశభక్తుడు ఉద్దంసింగ్ అని కొనియాడారు. కార్యక్రమంలో పలువురు విద్యార్థులు ఉన్నారు.

బహుమతి ప్రదానం

నాగర్‌కర్నూల్‌రూరల్: నాగర్‌కర్నూల్ మండలానికి చెందిన తెలుగు ఉపాధ్యాయుడు జానయ్యకు ఢిల్లీ పీపుల్ ఫోరం ఆఫ్ ఇండియా యూనివర్సిటీ ఆధ్వర్యంలో బహుమతి ప్రదానం చేశారు. రాజ్యాంగంలో పొందుపర్చిన హక్కులు, బాధ్యతలను ప్రజలకు, విద్యార్థులకు వివరించడంలో ఆయన చేసిన కృషికి యూనివర్సిటీ నుంచి బహుమతి అందుకున్నారు.

విధుల్లో చేరిక

చారకొండ: మండలంలోని పని చేస్తున్న జూపల్లి, జేపల్లి, కమాల్‌పూర్, శాంతిగూడెం, సిర్సనగండ్ల , తుర్కలపల్లి గ్రామాల పంచాయతీ కార్యదర్శులు ఇటీవల బదిలీలో 6 మంది కార్యదర్శులు బదిలీ అయ్యారు. ఆ స్థానాల్లో ఆయా గ్రామాలకు పంచాయతీ కార్యదర్శులుగా జూపల్లి శ్రావన్, జేపల్లి మల్లేష్, కమాల్‌పూర్ తండా రవి, శాంతి గూడెం ఎండీ ఆల్తాఫ్ అహ్మద్, సిర్సనగండ్ల సురేందర్ రెడ్డిలు పంచాయతీ కార్యదర్శులుగా బుధవారం విధుల్లో చేరారు.

ప్రజా సమస్యలపై అధ్యయన సర్వే



లక్ష్మాపూర్‌లో మాట్లాడుతున్న ఎల్ దేశ్యానాయక్

ఉప్పునుంతల: సీపీఎం రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ప్రజా సమస్యలపై అధ్యయన యాత్రలో భాగంగా బుధవారం మండలంలోని లక్ష్మాపూర్, దాసర్లపల్లి గ్రామాల్లో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఎల్ దేశ్యానాయక్ పర్యటించారు. లక్ష్మాపూర్‌లోని ఎస్సీ కాలనీలో ఉన్న పాడుబడిన చెన్నయ్య బావి ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. బావి వెంటనే పూడ్చి వేయాలని, కాలనీల్లో సీసీ రోడ్లు వేయించాలని గ్రామ పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. అనంతరం దాసర్లపల్లి గ్రామంలో దళిత రైతులకు చెందిన ఇనాం భూముల్లోకి దారి లేక ఇబ్బందులు పడుతున్న సమస్యను సీపీఎం నాయకులు క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి చింతల నాగరాజు, నాయకులు శ్రీరాములు, సైదులు, చిన్న రవి, పరుషరాములు తదితరులు పాల్గొన్నారు.

కల్వకుర్తిరూరల్: కాలనీలలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని సీపీఎం జిల్లా నాయకుడు బాల్‌రెడ్డి కోరారు. బుధవారం పట్టణంలోని టీఎన్‌జీఓ కాలనీలో నివాసం ఉంటున్న పేద ప్రజల సమస్యలను సీపీఎం బృందం సభ్యుల పరిశీలించారు. సీసీ రోడ్లు, మురుగుకాల్వలు, విద్యుత్ సౌకర్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఆంజనేయులు, పరశురాములు తదితరులు పాల్గొన్నారు.

నాగర్‌కర్నూల్‌రూరల్: పట్టణంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై మున్సిపల్ అధికారులు దృష్టి సారించాలని సీపీఎం మండల కార్యదర్శి అశోక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని పలు వార్డులను సందర్శించారు. అంతేకాకుండా మండలంలోని దేశిటిక్యాల, మల్కాపూర్ గ్రామాలలో ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆంజనేయులు, నాగరాజు, రవి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

తెలకపల్లి: మండలంలోని గడ్డంపల్లిలో సీపీఎం మండల నాయకులు చిటికెల రామకృష్ణ పర్యటించారు. గ్రామంలో వివిధ కాలనీలు తిరిగి సమస్యలను పరిశీలించారు. ఎస్సీ కాలనీలో 6, 7 వార్డులలో మట్టి రోడ్లపై మురుగు పారుతోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు బుచ్చయ్య, మాసమ్మ, నరసింహ, రమేష్, సరస్వతీ, రాములు, ఆనంద్‌తోపాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ



తాడూరు: మండలంలోని బలాన్‌పల్లిలో బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఏఈఓ సాయిరమేష్‌కుమార్ రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తగా వచ్చిన పట్టాదారు పాసుబుక్కులు కలిగి ఉన్న 18 ఏళ్ల నుంచి 59 వరకు ఉన్న రైతులు అర్హులని పేర్కొన్నారు. ఆధార్, నామినీ ఆధార్, పట్టాదారు పాసుబుక్కు, జిరాక్స్‌లతోపాటు దరఖాస్తు ఫారానికి జతపర్చాలని కోరారు. ఆగస్ట్ 5వ తేదీలోగా ఆయా క్లస్టర్ వారిగా రైతు వేదికల్లో ఉండే ఏఈఓలకు అందజేయాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ దీపక్, రైతులు యాదగిరి, జానకిరాంరెడ్డి, సిరాజ్, యాదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం: కేసు నమోదు

వెల్దండ: వివాహిత అదృశ్యమైన ఘటనపై బుధవారం కేసు నమోదైంది. ఎస్‌ఐ కురుమూర్తి తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని గానుగుట్ట తండాకు చెందిన నరేష్‌తో స్వప్నకు వివాహం అయ్యింది. భార్యభర్తల మధ్య గొడవల కారణంగా ఈ నెల 29న ఇంట్లో ఎవరూ లేని సమయంలో స్వప్న ఇద్దరి పిల్లలను తీసుకొని ఇంటి నుంచి వెళ్లిపోయింది. బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ తెలియలేదు. దీంతో స్వప్న తండ్రి గోపాల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తునట్లు ఎస్‌ఐ తెలిపారు.

సంతాన పరిమితి నిబంధనను ఎత్తేయాలి

నాగర్‌కర్నూల్‌రూరల్: స్థానిక సంస్థల ఎన్నికల పోటీలో పోటీ చేసే అభ్యర్థులకు సంతాన పరిమితి నిబంధనను ఎత్తేయాలని బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి పాలమూరు జిల్లా అధ్యక్షుడు కాళ్ల నిరంజన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బుధవారం పట్టణంలో బీసీ సంక్షేమ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సంతాన పరిమితి కారణంగా ఎంతో మంది రాజకీయ మేధావులు, పరిశీలకులు, స్థానిక సంస్థల ఎన్నికలకు దూరంగా ఉంటున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కుంభం మల్లేష్‌గౌడ్, కొత్ర శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనుల్లో రూ. 6.19 లక్షల అవినీతి



బల్మూర్: మండలంలో 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు జరిగిన ఉపాధి పనులపై స్థానిక మండల పరిషత్ ఆవరణంలో బుధవారం రాత్రి వరకు నిర్వహించిన 14వ సామాజిక ప్రజావేదికలో డీఆర్‌డీఓ పీడీ చిన్న ఒబులేష్ పాల్గొని డీఆర్‌పీల నివేదికలపై సమీక్షించారు. ఇందులో రూ.6.19లక్షల అవినీతి జరిగినట్లు గుర్తించి రూ.4.70 లక్షల రికవరీకి ఆదేశించారు. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పనులపై నిర్వహించిన సామాజిక తనిఖీ ప్రజావేదికను అధికారులు నామమాత్రంగా నిర్వహించారు. కాని ఇందులో అవినీతికి పాల్పడిన వారిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. సామాజిక తనిఖీకి సంబంధించి పూర్తి వివరాలను గురువారం వెల్లడిస్తామని అధికారులు తెలిపారు. అధికారులు కృష్ణరావు, నజీర్, ప్రత్యేకాధికారి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీఓ రాఘవులు, ఏపీఓ సువర్ణ, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌ఏఎస్ అంశాలపై ఉపాధ్యాయులకు శిక్షణ



బిజినేపల్లిలో శిక్షణకు హాజరైన ఉపాధ్యాయులు

నాగర్‌కర్నూల్‌రూరల్: బిజినేపల్లి మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు బుధవారం నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే మీద ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం నవంబర్‌లో విద్యార్థులకు నిర్వహించే ఈ టెస్ట్‌లో మూడో తరగతి, 6వ తరగతి, 9వ తరగతి విద్యార్థులకు సామర్థ్యాలను నిర్ధారించడానికి పరీక్ష ఉపయోగపడుతుందని కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్స్ శ్రీరాములు తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్‌లు, రీసోర్స్ పర్సన్స్ శివకుమార్, రేణు పాల్గొన్నారు.

కొల్లాపూర్: పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే(ఎన్‌ఏఎస్) అంశాలపై ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు బుధవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల నోడల్ ఆఫీసర్ ఇమ్మాన్యుయేల్ మాట్లాడారు. ఎన్‌ఏఎస్ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయాలని సూచించారు. హెచ్‌ఎంలు శోభారాణి, రాజవర్ధన్‌రెడ్డి, రాజేందర్, సీఆర్‌పీలు పానుగంటి వెంకటస్వామి, సుమిత్ర, రామకృష్ణ, అలీ, ఎంఐఎస్ విష్ణుమూర్తియాదవ్, రీసోర్స్ పర్సన్‌లు రబ్బానీ, రమణ, క్రాంతి ఉన్నారు.

తెలకపల్లి: త్వరలో నిర్వహించే న్యాస్ పరీక్షకు విద్యార్థులను సిద్ధం చేయాలని మండల నోడల్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి కోరారు. బుధవారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో పాఠశాలల సముదాయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేషనల్ అచీవ్‌మెంట్ సర్వేలో విద్యార్థులందరు ఉత్తమ ప్రతిభ చూపాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు.కార్యక్రమంలో తెలకపల్లి, కార్వంగ, గౌరెడ్డిపల్లి హెచ్‌ఎంతో పాటు పాఠశాల సముదాయ ప్రధానోపాధ్యాయులు చెల్మారెడ్డి, శ్రీనివాసులు, సుధాకర్‌రెడ్డి, రీసోర్స్‌పర్సన్స్ కావ్య, మల్లేష్, మణికంఠ, జైపాల్, ఉపాధ్యాయులు, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.